# కథ

# తెల్ల కోయిల

## ఈతకోట సుబ్బారావు

"ఆకాశాన్ని ఆశలో అనువదించుకొని, బ్రతుకుశ్వాసని నమ్మకంగా మలచుకొని, ఆరాటపడుతున్న హృదయాలకోసం ఒక్కసారి చిరునవ్వుతో స్పర్శించు......."

★ ★ ★

రాఘవయ్య మరోసారి ఉలిక్కిపడ్డాడు. కీర్తిమాటలు పదే పదే గుర్తుకువస్తున్నాయి. ఆలోచన కలిగిస్తున్నాయి. సూటిగా చెప్పాలంటే వేదనకు గురిచేస్తున్నాయి. బతుకు కూలీఅయి, బాధ్యతల బరువు మోసి మోసి అలసిపోయిన రాఘవయ్య తేనెటీగలాంటి మమతల తుట్టె – కీర్తి. ఆమెకోసం అమెరికా కలలు కని అలసిపోయాడు. కీర్తి పెళ్ళి విషయమే ఇప్పుడు మనసును తొలిచివేస్తుంది. ఆలోచనలను గాయపరుస్తుంది.

బాధలన్నీ కడుపులో దాచుకొని చిరునవ్వుల పాలుపోసి పూలమొక్కలా కీర్తిని చూసుకొంటున్నాడు రాఘవయ్య.

"ఎంట్రన్స్ రాయమ్మా" అంటే 'కాదు.... బియస్సీ చేరతా'నంది కీర్తి. ఫైనలియర్ మానేసి నర్సింగ్ చేస్తానంది.

కీర్తికోసం జోలపాటలు పాడటం ఆ వయస్సులో కూడా అలవాటు చేసుకున్నాడు రాఘవయ్య. చిన్నతనంలో లేత పాదాలు కందకుండానే కాదు, ఈ రోజుకీ భావాలు దెబ్బ తినకుండా బిగపట్టాడు.

నర్సింగ్ చేసి 'కార్పొరేట్ హాస్పటల్‌లో జాబ్ చేస్తాన'న్నా 'సరే'నన్నది ఇష్టంతో కాదు, ఊపిరిగా నిలిచిన ఆశల పంతెన పునాదుల్ని పెకిలించినా, అహంకారానికి అందమైన పేరిచ్చి కలసి నడిచే కాళ్ళచుట్టూ నిబంధనల సంకెళ్ళు బిగించకూడదనేది రాఘవయ్య నమ్మిన సిద్ధాంతం.

పదవీ విరమణ చేసిన ఉద్యోగం. స్వంత ఆస్తులు, బలమైన స్థిరాస్తులు, వాటికి మించి ఏకైక కూతురు. పేమెంట్ తీసుకుందామన్నా మెడిసన్ చేయనంది కీర్తి. మెడిసన్ చేస్తే "వ్యాపారం నే చేయలేను నాన్నా" అని సున్నితంగా తిరస్కరించింది.

అన్ని ఆశలమొగ్గలు తునిగిపోతున్నా భరించగలిగేడు. ఎందుకంటే రాఘవయ్య జీవశ్వాస కీర్తి. అమెరికా చదువు చదవనన్నా మంచి సంబంధం చేసి పంపుతామనే ఆలోచన ఆయనది. ఇప్పుడా ఆలోచనకు గండిపడింది.

ప్రభుత్వ ఉన్నతాధికారిగా రాఘవయ్య రిటైర్ అయినారు.

కోటి రూపాయలకు పైగా ఆస్తులకు, వారి మమతానురాగాలకు వారసురాలైన కీర్తి, హాస్పటల్‌లో చిరుద్యోగిగా, నర్సుగా పనిచేయడం.........

రాఘవయ్య మనసుకు సన్నటి గాయమే. అది ఎవ్వరికీ చెప్పుకోని, వినిపించలేనిది. బిటెక్, ఎమ్‌టెక్ సాఫ్ట్‌వేర్ నడుమ, కీర్తి గూర్చి బంధుమిత్రులు ఎవ్వరు ప్రశ్నించినా గుండెనిండా తపన. గావుకేక వినిపించనంత దూరం. మమతల స్పర్శ తాకనంత దూరం. కన్నీటి చార చేరనంత దూరం...... రాఘవయ్య వ్యధ.

మమతల మాధుర్యాన్ని శ్వాసించే మానవత్వం వుంటేనే మనసని నమ్మే వ్యక్తి రాఘవయ్య.

పెళ్ళికి ఒప్పించాలనే ప్రయత్నాలన్నీ చిరునవ్వుతో తోసిపుచ్చుతుంది కీర్తి.

అటు ఇటుగా పాతికేళ్ళ వయస్సుకు చేరువకావడం కూడా రాఘవయ్య ఆందోళనకు కారణం.

కాలప్రవాహం మార్పువలన తులశమ్మ పోవడంతో రాఘవయ్య తల్లిపాత్రను కూడా తీసుకొని ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

అందుకే – భారంతో, ఆందోళనకూడా ఎక్కువైంది. అవేమీ పట్టనట్టు, ఆ 'ఊసే' అంటీ అంటనట్లున్న కీర్తిని వేరే కోణంలో చూసేందుకు, ఆలోచించేందుకు ఎక్కడా రాఘవయ్యకు అవకాశం లేదు.

చిన్నతనం నుంచి స్వతంత్రభావాలు, మంచి క్రమశిక్షణ. కాలేజీ రోజులనుంచే కాదు, నేటికికూడా తన డ్యూటీ, ఇల్లు, ఆ ఇద్దరు ముగ్గురు స్నేహితులు తప్పించి, మరే లోకంలేదు. టీ.వీ. వీక్షణం కూడా లేదు, పుస్తకాల సాంగత్యం తప్పించి.

స్నేహితుడి పాత్ర కూడా పోషించే రాఘవయ్య, కీర్తి పెళ్ళివిషయం సూటిగా మాట్లాడేందుకు కూడా వెనుకడుగు వేయలేదు.

ఏమి మాట్లాడినా, ఎంత నచ్చచెప్పినా కీర్తి చిరునవ్వుముందురాఘవయ్య ఓటమిపాలయ్యేవాడు.

"రోగుల రక్తంలో ప్రాణ పరిమళం గుబాళించిన సందర్భాలు నాకున్నాయి నాన్నా" అని ముక్తసరిగా చెప్పేది.

మరో మాట్లాడను ప్రయత్నిస్తే –

"శరీరం ఛిద్రం చేసే సూదిపోట్లకంటే, రక్తమాంసాల్ని పీల్చేసే వైకుంఠ మాత్రల కంటే రోగులకు ప్రేమతో కూడిన ఒక పలకరింపు, అమ్మలాంటి 'ఒక ఆప్యాయతే బ్రతికిస్తుందనేది నీకు తెలియందేమీ కాదు నాన్నా' అనే కీర్తిమాటలు నిజానికి రాఘవయ్యకు అర్థమయ్యేది కాదు.

అయినా రాఘవయ్యకు కీర్తి కూతురు మాత్రమే కాదు. ఒక నమ్మకం.. ఒక ప్రతిబింబం. ఒక శ్వాస.........."

★ ★ ★

రండి......... అంకుల్...... కీర్తి 103 ఎ ఉందంటూ మాట్లాడుకుంటున్న

ఐదారుమంది సిస్టర్స్‌లో ఒకరు రాఘవయ్యను గుర్తించి రూమ్ చూపారు.

విశాలమైన ఎ.సి.గది. అది సంపన్నులకని ఆ వాతావరణం చెప్పకనే చెబుతుంది. మంచంపై మృతదేహం. అప్పుడే మృతిచెందినట్టుంది. రాఘవయ్య గుండె ఒక్కసారిగా గతుక్కుమంది. మృతదేహం ఉన్న బెడ్ ప్రక్కనే ఎత్తైన స్టూలు. స్టూలుమీద బాసిమెంతులువేసి కూర్చున్న కీర్తి. ఆ మృతదేహానికి గోళ్ళు తీస్తూ ముస్తాబు చేస్తుంది. కార్పొరేట్ హాస్పటల్‌లో మృతదేహాన్ని ముస్తాబు చేసి అప్పగించే భాగంగా ఒక్కతే..... విశాల గదిలో ... ఒక్కటే........ ఏ ఆలోచన ........ భయం....... భీతి........ లేకుండా పనిచేసుకుపోతున్న ఆమె కీర్తిలా కనిపించడంలేదు రాఘవయ్యకు.

"నువ్వో నివేదితవి. నిమ్నోన్నతాలెరుగని నీ మనసు ముంగిట్లో అన్నీ సమానమే....... నడయాడే దేవతవమ్మా నీవు" అనుకుంటూ తన చివరి పెళ్ళి ప్రయత్నం విరమించుకున్నాడు రాఘవయ్య.

"చిరుద్యోగి కాదు, నర్సు అంతకన్నా కాదు. ఆర్తులకు అమ్మ.... తెల్లని కోయిల....." సగర్వంగా గాలి పీల్చుకున్నాడు....... కీర్తికి వెన్నుదన్నులా నిలవాలనుకున్న రాఘవయ్య.

## శుభా కాంక్షలు ఇలా....

పుట్టినరోజు, వివాహ, పదవీ విరమణ శుభా కాంక్షలు,ఇతర విషయ సమాచారాలు చినుకులో ప్రకటనల ద్వారా తెలపాలనుకునేవారు ముందుగా ఫోటోతో సహా వివరాలను చినుకు కార్యాలయానికి రూ॥200/-లు ఎం.ఓ ద్వారా పంపండి. ప్రకటన పడిన సంచికను మీతో పాటుగా మీరు కోరిన ఐదుగురికి పోస్టుద్వారా పంపడం జరుగుతుంది.

# సూది

మనుషుల్ని కలిపి కుట్టాలనుంది.
చినిగిపోతున్న భూఖండాలకు
మాసికలు వెయ్యాలనుంది.
పికిలిపోతున్న భావవైరుధ్యాలను
రఫ్ చేయాలనుంది.

పేలికల బట్టలతో
తిరిగే జనంకోసం
ప్రతి అరుగుమీదా
కుట్టుమిషనైపోవాలనుంది.

నిజానికి ఈసూది
మా అమ్మ వారసత్వం
అనుబంధాల గుడ్డముక్కలతో
కుట్టిన బొంతమాయిల్లు.
కుట్టడమంటే కలపడమే
అమ్మ తన చూపులతో అందరినీ
ఒక్కతాటిపై నడిపేది.
సూదికొసతో గుచ్చినా
మంచి కోసమే ఆ అల్లిక.

పాపం ఈగుండీకి నాలుగు కళ్ళు
కళ్ళలోకి ధారలుగా
దారాలను చేదుకొని
కమీజుకి తమీజును నేర్పుతుంది.

జాతులుగా, దేశాలుగా, భాషలుగా
విడిపోయిన ప్రపంచాన్ని
నట్టింట్లో పోగేసుకొని
ప్రేమదారంతో కుట్టాలనుంది.

నాకు కాస్త సంకల్పమివ్వండి!
సముద్రాలను మడతపెట్టి
దుప్పట్లుకుట్టి పేదలకు పంచుతాను
ఆకాశాన్ని గొంగళ్ళుగా కత్తిరించి
చలిలో వొణికే వృద్ధులకు కప్పుతాను
మేఘాలను పొత్తిళ్లుగా మార్చి
పసిపాపల నిద్రనౌతాను.

దారీ తెన్నూ లేని కల్లోల జగతిలో
నా సూది ఒక దిక్సూచి,
ఈ చీరపై ఎన్ని పువ్వులో!
ఇవి సూదిముక్కులోంచే రాలిపడ్డాయి.

కలంలో అనంతకోటి అక్షరాలు
దాగున్నట్టు
సూది కొసనుంచి
సకల సౌందర్య జలపాతాలు దూకుతాయి.

అందుకే అంటాను
సూది నా జీవన సూత్రం
సమిష్టిలోకాలకు తెరిచిన కాంతినేత్రం.

- ఎస్. అరుణ